# స్పర్శ



పి. యస్. నారాయణ

# స్పర్శ

“రేపొద్దున పది గంటలకు రమ్మనమని వాళ్ళకు చెప్పారు నాన్న!”

అప్పుడు సరిగ్గా తొమ్మిది దాటి అరగంటయింది. ఎండ మండిపోతోంది.

“ఎవరిని?”

“ఎవరినేమిటే... ఎన్నిసార్లు చెప్పాలి నీకు... నిన్ను చూసేందుకు ఆ కుర్రవాడు, వాళ్ళ బాబాయి, పిన్ని వస్తున్నారు!”

సుగుణ గొంతును గంయ్‌న పెంచింది. “నేను చెప్పాను గదే నాకు వీలుగాదని... ఆమ్మా! నన్ను సతాయించొద్దు... నేను మాత్రం ప్రయాణం మానుకోను... మేం నెల రోజులబట్టీ ప్లాన్ చేసి, కంపెనీలో శెలవు తీసుకొని బయల్దేరుతుంటే ఎవడో బడుద్ధాయి వచ్చి నన్ను చూస్తానంటే నా ప్రోగ్రాం మార్చుకోవాలా? నేను ముందే చెప్పాను ఇప్పుడప్పుడే చేసుకోనని... వినిపించుకోవేం నువ్వు!” సుగుణ తన బెడ్‌రూంలో అద్దంలో చూసుకుంటూ ఐబ్రోస్ దిద్దుకుంటున్నది. అప్పటికే జీన్స్ ప్యాంట్‌మీద టీ షర్ట్ వేసుకున్నది.

“పెళ్ళి చేసుకోక ఏం చేస్తావే?... సన్యాసుల్లో కలుస్తావా... ఏం మాట్లాడుతున్నావ్... నువ్వు చదువుకొని నేర్చుకున్నది ఇదా... పొగరెక్కిన మాటలు కాకపోతే...! నోర్మూసుకొని ఇంట్లో కూర్చో!”

సుగుణ చేస్తున్న పని ఆపలేదు. చేతిలో పెన్సిల్ పక్కన పడేసి, అరచేతిలో కాస్త సాండల్ పౌడర్ వేసుకొని ముఖాన దూమెరుగ్గా రాసుకున్నది. బంగారు రంగులో మెరుస్తున్న

సన్నని స్టిక్కర్‌ను తీసుకొని నుదుట బొట్టులా పెట్టుకున్నది. పెదవులకు గులాబి రంగు లిప్‌స్టిక్ పూసుకున్నది.

“ఆ అబ్బాయి ఆఫీసు పనిమీద మద్రాసునుంచి వచ్చాడట... రేపు సాయంత్రం చెన్నయ్ ఎక్స్‌ప్రెస్‌కు తిరిగి వెళ్ళిపోవాలిట... నీ ప్రయాణం సాయంత్రం నాలుగు గంటలకు గదా... ఎలాగూ శెలవు పెట్టావ్... ఓ గంట పని... ఉదయాన అతను వస్తే ఏమైంది... బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటూ మాట్లాడుకోవచ్చు... మీ నాన్న కొలీగ్ జగన్నాథం అంకుల్ నీకూ తెలుసుకదా... వారి పెద్దన్నయ్యగారి అబ్బాయి... మంచి సంబంధమని తెలిసే నిన్ను చూడటానికి రమ్మనమన్నది!” ఆమె గొంతు పెంచింది.

సుగుణ వ్యానిటీ తీసుకొని తన గదిలోంచి బయటకు వచ్చింది.

“రేపు మా ప్రయాణానికి కొనుక్కోవాల్సినవి చాలా ఉన్నయి... ఆ పని పెందరాళే అయితే సరే... లేదా ఎక్కడయినా హొటల్లో భోజనం చేస్తాం అంతా!”

“గంగలో దూకండి... రేపుదయం మాత్రం నువ్వు ఎక్కడికీ వెళ్ళటానికి వీల్లేదు!”

సుగుణ బయటకు వెళుతున్నదల్లా విసురుగా తల్లి దగ్గరకు వచ్చింది.

“నాకేమన్న చెప్పి రమ్మనమన్నారా ఆయనగార్ని మీరు... నేను ఊరికెళుతున్నానని తెలియదా... నాకు ఇంకా చాలా ముఖ్యమయిన పనులున్నయి... నాకు వీలు కాదు... మా అమ్మాయి ఊళ్ళోలేదని, రావద్దని చెప్పండి... కాదూ గూడదూ అని తీసుకువచ్చి నా ముందు కూర్చోబెట్టారో మొహానే చెప్పేస్తాను... నువ్వు నాకు నచ్చలేదు, నేను చేసుకోను అని... తరువాత నన్ని లాభంలేదు!” ఎత్తు మడమల చెప్పులను టకటకలాడించుకుంటూ బయటకు వచ్చి కారిడార్‌లో వున్న స్కూటీ స్టాండు తీసి రోడ్డెక్కించింది, కురచగా కత్తిరించుకున్న జుట్టు గాలికి ఎగురుతుండగా.

“దీన్ని కాదు అనాల్సింది... నెత్తినెక్కించుకున్న ఆయనగార్ని అనాలి... ఒక్కతే కూతురు ఒక్కతే కూతురు అంటూ ఒళ్ళూపై తెలియకుండా అది ఆడింది ఆటలా పెంచాడు... ఇప్పుడు కొరకరాని కొయ్యలా తయారయింది!” చికాగ్గా హాల్లోకి వచ్చి భర్తకు చెప్పటానికి సెల్‌ను చేతిలోకి తీసుకుంది.

పదో తరగతి వరకూ బాగానే వుండేది... చక్కగా జరీ అంచు పరికిణీ కట్టుకొని, ఓణీ వేసుకొని, పొడుగాటి జడలో గుప్పెడు పూలు పెట్టుకొని స్కూలు కెళ్ళేది. కాలేజీలో జేరింది మాయరోగం పట్టుకుంది... మగరాయుడిలా ప్యాంటు, టీ షర్టు, అపభ్రంశంగా జుట్టు

కత్తిరించుకోవటమే గాకుండా హెన్నాతో కొబ్బరిపీచులా తయారు చేసుకొని, అది గాలి కెగురుతుంటే కులుక్కుంటూ బయట తిరగటం... హవ్వ! పిదప కాలం పిదప బుద్ధులు... ఏమైనా అంటే... వెధవ ముసలమ్మ కబుర్లు చెప్పబోకు... ఇప్పటి ఫ్యాషన్ ఇది... ఒక్కసారి బయటకు వచ్చి ప్రపంచం ఎలా మారిపోతున్నదో చూడు– అంటూ ఓ దీర్ఘం...

భర్త సెల్ ఆన్ చేయగానే, “అది మొండికేస్తోంది... రేపు వీల్లేదంటున్నది... కాదూ గూడదూ అని కూర్చోబెట్టినా వాళ్ళముందు అవాకులూ చెవాకులూ పేలి మన పరువు తీసేలా వున్నది... ఒక పని చేయండి... మీ కొలీగ్‌కు చెప్పండి... పీరియడ్స్... ఆ సమయంలో చూపించటం మంచిది కాదు, ఈసారి వచ్చినప్పుడు ఏర్పాటు చేద్దామని... మర్యాదగా వుంటుంది!” అన్నది నీరసంగా దమయంతి.

అటునుంచి ఆయన ఓ నిట్టూర్పు విడిచాడు.

పిల్లవాడు చెన్నయ్‌లో సాఫ్ట్‌వేర్‌లో పని చేస్తున్నాడు. జీతం సంవత్సరానికి ఎనిమిది లక్షలట. అతడి తండ్రికీ ఇంకా రెండేళ్ళ సర్వీసు ఉన్నది. అక్కడే స్వంత ఇల్లున్నది. అయనకు ముగ్గురు మగపిల్లలు... ఒక ఆడపిల్ల... ఆడపిల్లకు పెళ్ళయింది. ఢిల్లీలో ఉంటోంది. పెద్దకొడుక్కూ పెళ్ళయింది. బెంగుళూర్‌లో ఓ మల్టీనేషనల్లో మార్కెటింగ్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు రెండోవాడు. మూడో పిల్లవాడు ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్లో వున్నాడు. కంచీపురం దగ్గర కాలేజీలో చదువుతున్నాడు. తన కొలీగ్ మంచి సంబంధం అని చెప్పటంతో కలిస్తే బాగుంటుంది అని ఆశ పడుతున్నాడు తను. కూతురంటే మహా చికాకు వేసింది విష్ణుమూర్తికి. రాత్రికి ఒకసారి కూతురుతో మాట్లాడి వాళ్ళకు చెబుదాంలే అనుకున్నాడు.

* * *

సుగుణ శారద ఇంటికి వెళ్ళింది. అప్పటికే ఆ అమ్మాయి రెడీగా వున్నది. ఇద్దరూ కలిసి స్కూటీమీద మారేడుపల్లిలో వున్న జయంతి దగ్గరకు వెళ్ళారు.

టూర్ వెళుతున్నది నలుగురు. ఆ ముగ్గురూ కాక వరంగల్ నుంచి నీలవేణి వస్తున్నది. రాత్రికల్లా ఇక్కడ వుంటానన్నది.

ముందు కలకత్తా చూసి, శాంతినికేతన్‌లో ఓ రోజు గడిపి, షిల్లాంగ్‌కు ఫ్లయిట్‌లో వెళ్ళాలని, వీలుంటే చిరపుంజిగూడా చూసిరావాలనేది వాళ్ళ ప్రోగ్రాం. అన్ని చోట్లకూ పోవటానికి, రావటానికి టిక్కెట్లయితే తీసుకున్నారు.

చాలా కాలమయింది బయట తిరిగి. కాలేజీలో వుండగా రెండు మూడు సార్లు ఎడ్యుకేషన్ టూర్‌లో వెళ్ళినమాట వాస్తవమేకాని, వెంటవచ్చే లెక్చరర్ల ఆంక్షలతో స్వేచ్ఛ ఉండేది కాదు. ఇప్పుడు ఉద్యోగాలల్లో జేరారు. నీలవేణి ఒక్కతే ఉద్యోగం చేయనిది. పెద్దవాళ్ళకు ఆ అమ్మాయి ఉద్యోగం చేయటం ఇష్టంలేదు. బాగా డబ్బున్నది. వాళ్ళ బంధువుల అబ్బాయితోటే త్వరలో వివాహం జరగబోతోంది. అతడూ వరంగల్లులోనే కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. పెళ్ళయ్యేలోగా అంతాకలిసి ఓ పదిరోజులు హాయిగా తిరిగి రావాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రోగ్రాం పెట్టుకున్నారు.

జయంతి వీళ్ళను చూస్తూనే, “రండి... రండి... మీ కోసమే ఎదురు చూస్తున్నాను!” అన్నది ఆదుర్దాగా.

“ఏమైందే?... అంత హడావుడిగా రమ్మనమన్నావ్?” సుగుణ అడిగింది.

“పొద్దున్నే మూడ్ పోయిందే... దుర్గ ఫోన్ చేసింది!”

“ఏమిటిట?”

“అది అత్తగారింటినుంచి పారిపోయి వచ్చేసిందట... ఏదో గొడవయినట్లున్నది అక్కడ!”

“అదేం? ఏమైందిట?” ఆత్రంగా అడిగింది సుగుణ.

“భర్త ఓ పెద్ద అనుమానం మనిషిట... కాల్చుకుతింటున్నాడట... వాడికి తోడు అత్తా మామల సాధింపు ఎక్కువయిందట... మానసికంగానే కాకుండా, భౌతికంగానూ హింసిస్తున్నారట... అందుకనే చెప్పా పెట్టకుండా రైలెక్కి వచ్చేశానంటూ పొద్దున్నే ఫోన్ చేసింది!”

దుర్గ వాళ్ళ కాలేజిమేటు. వీళ్ళతోపాటే తిరుగుతూ చాలా సరదాగా వుండేది. చదువులో ఉండగానే పెళ్ళి చేసి పెద్దలు వాళ్ళ బాధ్యత తీరిందన్నట్లుగా చేతులు దులుపుకున్నారు. అతడు ముంబాయ్‌లో ఏదో ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. మ్యారేజ్ బ్యూరో ద్వారా వచ్చిన సంబంధం. ఇరు పక్షాలకూ అన్నీ నచ్చటంతో ఆరు నెలల క్రితమే పెళ్ళి చేసి అత్తగారింటికి పంపారు.

“దాని దగ్గరకు వెళ్దామా మరి?”

“నాకయితే మనం ఊరినుంచి వచ్చింతరువాత వెళ్దామని వున్నది... ఇప్పుడు వెళ్ళి దాన్ని చూసి బాధపడి, ట్రిప్పును ఎంజాయ్ చేయలేమేమో అనిపిస్తోంది!” అన్నది శారద.

జయంతి మాట్లాడలేదు. సుగుణకు శారద మాటలతో తిక్కరేగింది. గయ్యిన లేచింది. "అది అంత ఇబ్బందుల్లో వుంటే మనకు ట్రిప్పేమిటే?" అన్నది విసురుగా.

"నువ్వు ప్రతిదానికీ ఎక్సయిట్ అవ్వబోకు... నాకు తెలిసినంత వరకూ అసలు కారణం వాళ్ళు దాన్ని అనుమానించి హింసించటం కాదు... వీళ్ళదీ తప్పున్నది... పెళ్ళికి ముందు కట్నం ఇస్తామని, చివరకు ఏవో ఇబ్బందులు వచ్చి ఇవ్వలేకపోయారు. తరువాత ఇవ్వలేదేమో... బహుశః అది మనస్సులో పెట్టుకొని వాళ్ళు సతాయిస్తుండవచ్చు!"

"అంటే డబ్బులివ్వకపోతే సతాయించటమేనా? దానికి దీనికీ సంబంధమేమిటి... డబ్బులివ్వంది దాని అమ్మా నాన్నా... కావాలంటే వాళ్ళను సతాయించుకోమను!" సుగుణ కళ్ళు ఎర్రబడుతున్నయి.

శారద స్నేహితురాలి చేయిపట్టుకొని అనునయంగా అన్నది. "దీన్ని ఏడిపిస్తే వాళ్ళను ఏడిపించినట్లు కాదే!"

సుగుణ పళ్ళు కొరుకుతూ నిలబడింది.

"ముందు వెళ్ళి ఒకసారి పలకరించి వద్దాం... అంతగా వాళ్ళకు డబ్బు ఇబ్బందయి, దాని కష్టాలకు అదే కారణమయితే మనమే కొంత సర్దుదాంలే!" అన్నది సుగుణ జయంతితో.

స్కూటీ అక్కడ పెట్టేసి జయంతి వాళ్ళ కారులో ముగ్గురూ దిల్‌షుక్‌నగర్ వెళ్ళారు.

వీళ్ళను చూస్తూనే దుర్గ బయటకు వచ్చింది.

ఆరు నెలల క్రితం పెళ్ళయిననాటికీ, ఈ రోజుకీ పోలికే లేదన్నట్లుగా వున్నది ఆ అవతారం. బాగా చిక్కిపోయింది. ఎప్పుడూ సరదాగా ఉండి తను నవ్వుతూ అందరినీ నవ్వించే దుర్గను చూస్తూనే ముగ్గురూ గ్రహించారు– అది నిజంగా ఇబ్బందుల్లో ఉన్నట్లుగా.

"ఎప్పుడొచ్చావ్?" సుగుణే ముందుగా నోరు విప్పింది, అ ఆమ్మాయి గదిలోకి వెళ్ళిం తరువాత.

"నిన్న!"

"నిన్న వచ్చిందానివి పొద్దుటిదాకా ఎందుకు ఫోన్ చేయలేదు!"

"చికాగ్గా వున్నది... అందునా ప్రయాణపు బడలిక... ఇంటికి వచ్చింతరువాత నేనేదో తప్పుచేసినట్లుగా మా వాళ్ళ సణుగుడు!"

"ఇంతకీ ఏమయిందే... ఎందుకు వచ్చింది ఈ పరిస్థితి?"

దుర్గ పేలవంగా నవ్వింది.

"నేను కాపురానికి వెళ్ళిన కొద్దిరోజులకే తెలిసింది ఆ మహారాజుగారికి అప్పటికే ముంబాయ్‌లో ఓ అమ్మవారు వున్నదని... అది నాకు తెలియటంతో భయపెట్టి ఏదో ఒక వంకతో నా నోరు నొక్కేయాలని చూస్తున్నారు!"

"కట్నం డబ్బుకోసం కూడా వేధిస్తున్నారా?" సుగుణ అడిగింది శారద మాటలు గుర్తుకు రాగా.

"ఆ బాకీ పెళ్ళయిన నెలలోనే మా వాళ్ళు పొలం అమ్మి తీర్చేశారు... ఆ వంకతో వేధించే అవకాశం లేకనే నా మీద లేనిపోని అభాండాలు వేసి గోల చేస్తున్నది!"

"పళ్ళు రాలగొట్టాల్సింది... ఎందుకూరుకున్నావ్?" సుగుణే అన్నది.

"పళ్ళు రాలగొడితే కట్టించుకుంటారు... సిగ్గులేని మనుషులు... అందుకే వుండలేక వచ్చేశాను!" దుర్గ చిన్నగా అన్నది.

"మరిప్పుడేం చేద్దామని?"

"ఏదో ఒకటి చేస్తాను... వాళ్ళు తప్పుచేస్తూ సుఖంగా వుండటం నేను సహించలేను!" అన్నది దుర్గ. ఆమె కంఠం ఆ క్షణాన దృఢంగా వున్నది. "వాళ్ళకు నేనేమిటో తెలిసొచ్చేలా బుద్ధి చెప్పాలి... మాటలతో ఆయ్యేపని కాదు... ఆక్కడవుండి నేనొక్కదాన్నీ ఏమీ చేయలేను... అందుకే వచ్చేసింది!... ఇక్కడ లాయర్‌ను కలిసి వాళ్ళను కోర్టుచుట్టూ తిప్పి మూడు చెరువుల నీళ్ళు త్రాగిస్తాను...!"

"వాడు నిన్ను మోసం చేసినట్లుగా రుజువులు కావాలిగదా!" అన్నది శారద.

శారద చాలా సాత్వికురాలు. త్వరపడి ఏ విషయంలోనూ ముందుకు దూకదు. లోతుపాతులు తెలుసుకోవాలని ప్రయత్నిస్తుంది.

"వాళ్ళిద్దరి ఫొటోలు కూడా దొరకపుచ్చుకొని వచ్చాను!" అన్నది కాస్తంత ధీమాగా దుర్గ.

"అవి కంప్యూటర్ మీద తయారు చేసిన ఫేక్ ఫొటోలు అంటే!" శారదే అన్నది మళ్ళా.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Sparsa+Navala**

* * *